ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# ప్రజా కవిగా అందెశ్రీ

**ఆచార్య భూక్య తిరుపతి**

**ప్రొఫెసర్, తెలుగు శాఖ,హైదరాబాద్ విశ్వవిద్యాలయం,thirupathi2612@gmail.com**

Article Received: 06/01/2025

Article Accepted: 03/02/2026

Published Online: 05/02/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3153

**పరిచయం:**

అందెశ్రీగా ప్రసిద్ది చెందిన అందె ఎల్లయ్య గారు పూర్వ వరంగల్ జిల్లా, ప్రస్తుత సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో 1961వ సంవత్సరం జులై18 న జన్మించారు. చిన్ననాటి నుండి కటిక పేదరికాన్ని, దుర్భరమైన జీవితాన్ని అనుభవించిన అందెశ్రీ, తన అయిదవ ఏటనే రేబర్తి గ్రామంలోని మల్లారెడ్డి, రాధమ్మ దంపతుల దగ్గర జీతగానిగా పనిలో చేరాడు. తనచేత పని చేయించుకుంటూ, యజమాని జక్కిరెడ్డి మల్లారెడ్డి చెప్పే రామాయణ, భారత ఇతిహాసాలను ఎంతో శ్రద్ధగా వింటూ చిన్ననాడే తనలో భక్తి భావనకు పునాదులు వేసుకున్నాడు అందెశ్రీ.

తన పదవ ఏట కోహెడ ప్రాంతంలో నివసించే వరకవి కుమ్మరి సిద్ధప్ప బోధనలకు ఆకర్షితుడై వారి దగ్గర శ్రుతపాండిత్యాన్ని సంపాదించాడు. అనాథగా బాల్యాన్ని నెట్టుకొస్తున్న అందెశ్రీ చాలాకాలం పశువుల కాపరిగా పనిచేస్తూ 1978 ప్రాంతంలో బతుకుదెరువు కోసం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకి వెళ్ళాడు. అక్కడ తాపీమేస్త్రిగా పనిచేస్తున్న క్రమంలోనే అందెశ్రీ శంకర్ మహారాజ్ దృష్టిలో పడ్డాడు. ఆయన అందె ఎల్లయ్య పేరున అందెశ్రీ గా మార్చి, *"అరే..! ఎంగిలి పాటలు పాడటం కాదురా.. అక్షరం నీ శరీరంలో ఆపాదమస్తకం ధ్వనిస్తున్నది. నువ్వే పాటలను కైకట్టాలె.. ఈ అందెను అమ్మ పాదాల సందడి చేయించాలె"* అని బోధ చేశాడు. మహారాజ్ పలికిన ఆ మాటలు అందెశ్రీపై గాఢమైన ప్రభావాన్ని చూపించాయి. ఆ పవిత్ర గోదావరిలో స్నానమాచరించిన నాటి నుండి తన జీవిత పర్యంతం ఇక తాపీని పట్టే దుస్థితి తనకు రాలేదని చెప్పుకున్నాడు అందెశ్రీ.

అందె ఎల్లయ్య నుండి అందెశ్రీగా మారిన తరువాత తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో ప్రదేశాలలో పర్యటిస్తూ అనేక మంది సాధువులను, సంతులను కలిసి పండరీపురంలో నివసించే జ్ఞానేశ్వర

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

మహారాజు గారివద్ద, కుమ్మరి సిద్ధప్ప వరకవి దగ్గర శిష్యరికాన్ని పొందాడు. వారిని ఆధ్యాత్మిక గురువులుగా భావించి తరువాత మెల్లమెల్లగా పలురచనలకు ఆశువుగా శ్రీకారం చుట్టాడు అందెశ్రీ. తన 20 వ ఏట బాసర సరస్వతి అమ్మవారిని మొదటిసారి దర్శించుకున్న అందెశ్రీ అప్పటి నుండి 'వాక్కులమ్మ'నే తన దైవంగా భావించాడు.

**వ్యక్తిత్వం:**

*"నదీ ప్రవాహంలో వందల వేల కొద్ది పుల్లలు అడ్డమొస్తాయి, కానీ నది ఎక్కడా ఆగినట్టు నాకు కనబడదు. మనిషి జీవితం కూడా జీవనదిలాంటిదే"* అంటూ తను జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదురుకున్నా, కష్టాల సుడిగుండానికి తన జీవితాన్ని ముగిద్దామనుకున్నా ఎక్కడా వ్యక్తిత్వాన్ని కోల్పోని మనిషి అందెశ్రీ. *"సింహానికి ఆకలేస్తే వారం రోజులు ఆగి ఆఖరికి తిండి దొరకకపోతే చెట్టుకు తల గుద్దుకొని చచ్చిపోతుంది కానీ గడ్డి మాత్రం తినదు"* అంటూ తన వ్యక్తిత్వాన్ని తాను నిర్వచించుకున్నాడు. అందెశ్రీకి మొదటి నుండి మద్యం, మాంసం అలవాట్లు లేవు. *"నాలుక రుచులకు అలవాటుపడ్డ జీవితం కాదు నాది; ఋషి పరంపరకు అలవాటుపడ్డ జీవితం నాది"* అని ప్రకటించుకున్న మహనీయుడు ఆయన. మాతృదేవోభవ, పితృదేవోభవ అన్న పదాలు ప్రపంచానికి ఆదర్శాలయితే నా పుట్టుకకు అవి ప్రశ్నార్థకాలు అని చెప్పుకున్నాడు. నమ్మిన విషయాన్ని స్పష్టంగా చెప్పగలగడంలో ఆయన దిట్ట. తప్పు చేయడం, తప్పించుకోవడం ఆయనకు తెలియని విషయాలు.

**సామాజిక నేపథ్యం:**

మనిషి ఎంతటి ప్రతిభావంతుడైనా కులం తనను చివరివరకూ వెంటాడుతూనే ఉంటుంది. అందెశ్రీ దృష్టిలో 'దళిత' పదం రాజ్యాంగం అవతలి శబ్దం. దళిత కులం, దానికి లిపి, ప్రత్యేకమైన సిద్ధాంత ప్రతిపాదనలు ఉంటాయనే విషయం తనకు తెలియదంటూ తన దృష్టిలో దళితులు అనేదేమీ లేదంటూ *"మనిషితనం, అన్నంపెట్టే చేయి, ఆదరించే హృదయం అవే నాకు పరాకాష్ట"* అంటాడు అందెశ్రీ. *"నాకు అగ్రగామి తలలో పుట్టిన బాపనోడు, భుజస్కంధాల్లో పుట్టిన క్షత్రియుడు, నాభి తొడల్లో పుట్టిన వైశ్యుడు, పాదాల్లో పుట్టిన శూద్రుడు, నలుగురు కాదు.. ఈ చాతుర్వర్ణ వ్యవస్థను వెక్కిరించిన పంచమవర్గం కూడా వేరుకాదు. ఈ అయిదు భాగాలు నా శరీరం నుండి వచ్చినవి కాబట్టి ఒక్క మనిషిని అయిదు ముక్కలుగా తెగనరికిన తరువాత వచ్చిన వ్యవస్థ ఇది.*

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

*కాబట్టి ఈ ముక్కలన్నీ అతికిస్తే ఒక మనిషంటడు, ఆ మనిషితనం ఎక్కడుంటదో ఆ మనిషితనపు ఆనవాళ్ళ చిరునామా ఎక్కడుంటదో అక్కడ నేనుంటా"* అంటూ కులమే గోడపైతే, కూకటివేళ్ళతో పెకిలించి పారేయాలి అనే సామాజిక సమానత్వాన్ని అందెశ్రీ ప్రకటించాడు.

**తెలంగాణా ఉద్యమ నేపథ్యం:**

సింహాలు తమ చరిత్ర తాము రాసుకోనంత వరకూ గుంటనక్కలు చెప్పే సోది ముచ్చటలే చరిత్రగా నిలిచిపోతాయి అన్నట్టు తెలంగాణ సంస్కృతిని, యాసను, అస్తిత్వాన్ని, అవమానపరుస్తూ ఈ తెలంగాణకు చరిత్రే లేదు అన్న గొంతులను తన కలం పోటుతో, గళం వేటుతో ఎదిరించి "*తెలంగాణ గడ్డ మీది పిడికెడు మట్టి వెయ్యి కిలోల బంగారానికైనా సరితూగదు*" అని మాతృభూమిపై తన అభిమానాన్ని చాటుకున్న మహనీయుడు అందెశ్రీ. తెలంగాణ ఉద్యమంలో నేనేమీ త్యాగాలు చేయలేదు. జననీ జన్మభూమిశ్చ స్వర్గదపి గరీయసి అన్నట్టు నన్ను కన్న నేల రుణం తీర్చుకోవడానికి నేను తెలంగాణ ఉద్యమానికి వచ్చాను అని అందెశ్రీ ప్రకటించుకున్నాడు.

ఈయన ఒక సందర్భంలో తెలంగాణ గొప్పతనాన్ని గురించి చెబుతూ *"అరే..! నైజామోని పైజామా ఊడగొట్టింది/ రజకారు మూకలను దిగంతాలకు తరిమింది/ గడీలకు అగ్గి పెట్టింది/ రాచరికానికి గోరీ కట్టింది/ తెలంగాణ అంటే పిడికెడు మట్టారా..? పిపీలికాది బ్రహ్మ పర్యంతం – కంపరం పుట్టించే మందు పాతర"* అంటూ గొంతెత్తి గర్జిస్తూ ప్రతీ సందర్భంలో తన రొమ్మిరిసి *"నా అమ్మను చెరబడితే ఎవరినీ వదిలేది లేదు, కాలం విసిరే ఖడ్గానికి ఏ తలైతేనేమి బలి కావలసిందే"* అంటూ తెలంగాణ మీద తనకున్న ప్రత్యేకమైన అభిమానాన్ని చాటుకున్నారు.

తాను జీవించిన సమకాలీన సమాజంలో ప్రసిద్ధులైన పాటకారులు ఎంతోమంది ఉన్నప్పటికీ తెలంగాణ ఉద్యమానికి తన పాటల ద్వారా ఊపిరినూది ప్రజలలో చైతన్యాన్ని తీసుకువచ్చాడు అందెశ్రీ. ఆయన రాసిన *జైబోలో తెలంగాణ నిలువెల్ల గాయాల వీణ* అనే పాట యువతలో పోరాటస్ఫూర్తిని రగిల్చింది. ఈయనే రాసిన మరో పాటలో "*చూడు తెలంగాణ చుక్క నీళ్ళు లేనిదాన - నాగోడు తెలంగాణ బ్రతుకు పాడైన వీణ*" అంటూ తెలంగాణ దీనస్థితిని ఎంతో ఆవేదనతో వర్ణించారు. తెలంగాణ మలిదశ ఉద్యమకాలంలో 2002లో కామారెడ్డిలో జరిగిన ధూమ్ ధామ్ కార్యక్రమంలో సెప్టెంబరు 30వ తారీఖున జయజయహే తెలంగాణ గేయం పురుడుపోసుకుంది. నాటి నుండి నేటి వరకూ ఈ గేయం తెలంగాణ జనుల జీవనాడై

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

వెలుగొందుతుంది. ఈ గేయాన్ని తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతీ పాఠశాలలో విద్యార్థులు రోజూ ఉదయం తమ ప్రార్థన సమయంలో నిత్యవిధిగా ఆలపించారు. ఇప్పటికీ ఆలపిస్తున్నారు. ఖమ్మం జిల్లా కోర్టు న్యాయవాదులు ఈ జయజయహే తెలంగాణ గేయాన్ని 1556 రోజులు ప్రతిరోజూ ఆలాపన చేశారు. ఇలా తన గళంతో స్వరాష్ట్ర ఉద్యమాన్ని నడిపిస్తూ, అందరి కంఠమై తాను పలికాడు అందెశ్రీ.

**సాహిత్య ప్రస్థానం:**

*కవిత వెల్లువెత్తాలంటే కంటతడి కావాలి ! కావ్యం రాయాలంటే హృదయం ద్రవించాలి !*

*ఇది యుగాలనాడే రుజువైన సత్యం.*

*"ఈ అనాథను అందరి వాడిని చేసింది సాహిత్యం, ఈ అనామకుణ్ణి ఆకాశమెత్తింది సాహిత్యం"* అంటూ అందెశ్రీ తన సాహితీ జీవితాన్ని గురించి చెప్పుకున్నాడు. అక్షర స్వరూపం తెలియకపోయినా, అక్షర హృదయాన్ని తెలుసుకున్న ఘనుడు అందెశ్రీ. ప్రకృతిని పాఠశాలగా, ప్రజలను పంతుళ్లుగా భావించి పైరగాలిలో, పక్షుల గుంపులో, వాన చినుకులో, మట్టి వాసనలో తన కవిత్వాన్ని జనింపజేశాడు. తన బాల్యపు అనుభవాలనే రచనలకు మున్నుడి చేసుకుని కష్టాలను, కన్నీళ్లను కవిత్వంలో తనదైన శైలిలో పలికించాడు అందెశ్రీ.

ఈయన సాహిత్య ప్రస్థానం మొదట పద్యం, తరువాత పాట, కడకు కవిత్వంగా వెలువడింది.

**పద్యం**

పద్యం ఛందో లక్షణాలతో కూడుకున్న ప్రక్రియ. ఇది పండిత విద్యగా ప్రసిద్ధి. అందెశ్రీకి ఏమాత్రం అక్షరవిద్య లేకున్నా, వాక్కులమ్మ(సరస్వతి) దయతో కవిత్వం చెబుతున్నానని అనేవారు. తన పరిచయాన్ని సీసపద్యంలో ఈ విధంగా చెప్పుకున్నాడు..

***జిల్ల ఓరుగల్లు జిజ్ఞాస నాయిల్లు***

***మా ఊరు రేబర్తి మంచి స్ఫూర్తి ---***

ఇది పూర్వకవుల అవతారిక పద్యాలకు ఏమాత్రం తీసిపోదు. తన ఇష్టదైవమైన వాక్కులమ్మను స్తుతిస్తూ..

***మేఘాల లోగిళ్ళ మెరుపు తీగలదాగి***

***ఉరుముల శబ్దమై ఉన్న దెవరు ?***

***అక్షరాలతో జీవ లక్షణాలను పెంచి***

***సృష్టిని తిలకింప దృష్టి ఎవరు ? ---***

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

అంటూ అన్నీ తానై నడిపించే శక్తిని అలతి అలతి పదాలలో అపురూపంగా వర్ణించాడు అందెశ్రీ.

**పాట**

అందెశ్రీ పాట గురించి మాట్లాడాల్సి వచ్చినప్పుడు ప్రధానంగా రెండు విధాలుగా ఆయన పాటలను చెప్పుకోవచ్చు. ఒకటి ఆవేశం, అనుభూతి, అనుభవం కలగలిసి ఆశువుగా వెలువడ్డ రకమైతే, సినిమాల కోసం ఈయన రాసిన పాటలు మరోరకం. ఇవి రాసిలో తక్కువైనా, వాసిలో ఎక్కువ. సుద్దాల హనుమంతు గారి పల్లెటూరి పిల్లగాడా పాటను తన జీవితానికి ఆపాదించుకొని తన బ్రతుకుని పాటగా మలుచుకున్నారు అందెశ్రీ. ఈ నేపథ్యంలోనే పల్లె నీకు వందనాలమ్మో / నన్నుకన్న పల్లెతల్లి నీకు వందనాలమ్మో.. అంటూ తనకు పాట నేర్పి బ్రతుకు తోవ చూపిన పల్లెకు కైమోడ్పులర్పించారు అందెశ్రీ.

ఎర్ర సముద్రం సినిమాలో "మాయమై పోతున్నడమ్మో మనిషన్నవాడు / మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు" అంటూ మనుషులలో రోజురోజుకూ దిగజారిపోతున్న మానవత్వపు విలువలను తట్టిలేపే ప్రయత్నం చేశాడు అందెశ్రీ. తెలంగాణ ఉద్యమనేపథ్యంలో వచ్చిన జైబోలో తెలంగాణ చిత్రంలో అందెశ్రీ రాసిన "జన జారతలో మన గీతం జనకేతనమై ఎగరాలి / ఝుంఝూ మారుత జననినాదమై జే గంటలు మోగించాలి" అనే పాటలో మన ప్రాంతం కోసం లేదా దేశం కోసం బ్రతకడంలోనే నిజమైన బ్రతుకు ఉందని ఈయన స్పష్టంగా చెప్పారు. వేగుచుక్కలు సినిమాలోని కొమ్మ చెక్కితే బొమ్మరా / కొలిచి మొక్కితే అమ్మరా/ ఆదికే ఇది పాదురా/ కాదంటె ఏదీ లేదురా అంటూ గ్రామాలలో జానపద దేవతల గురించి, ప్రాచీన కాలంనాటి మాతృదేవత ఆరాధన గురించి తెలియజేశారు. ఈ పాట చివరలో ఎవరి నమ్మకాలు వారివి ఎక్కిరించే హక్కులెక్కడివి అంటూ సమాజానికి తన ప్రశ్నను విడిచిపెట్టాడు. ఈయన రాసిన తలమీద సుట్టబట్ట ఆపైన పండ్ల తట్ట పాట తెనుగోళ్ల ఎల్లమ్మను చిత్రించింది.

చూడ చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి / మళ్ళీ జన్మంటూ ఉంటే సూరమ్మా! తల్లి నీ కడుపున పుడుతా మాయమ్మా.. అన్న గీతాన్ని ఆర్ నారాయణమూర్తి ఊరు మనదిరా సినిమాలో ఎంపిక చేసుకొని పెట్టుకున్నారు. ఈ పాటలో సూరమ్మ అంటే బిరుదురాజు రామరాజు గారి భార్య. ఆవిడ అందెశ్రీని చాలాకాలం పాటూ అన్నం పెట్టి కొడుకులా ఆదరించినందుకు మళ్ళీ జన్మ అనేది ఉంటే ఆవిడకే కొడుకుగా పుడతానని తన ఋణ అనుబంధ భావాన్ని ప్రకటించాడు.

ఆయన పాటలనన్నింటినీ పాటల పూదోట పేరుతో పుస్తకంగా వెలువరించారు.

**కవిత్వం**

అందెశ్రీ 1995వ సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో *అందెల సందడి* పేరుతో సినారె గారి చేతుల మీదుగా తన పుస్తకాన్ని ఆవిష్కరించుకున్నాడు. స్త్రీవాద ఉద్యమ నేపథ్యంతో నేనే స్త్రీగా ఎందుకు మారకూడదు అన్న ఒక ప్రశ్నార్థక సమయంలో నేను నీకు బానిసనా అనే శీర్షికతో కవిత్వం రాశారు.

*కొవ్విన నీ కోరికల జివ్వుమన యవ్వన కాలపుటంచుల*

*రివ్వున ఎగిరే గువ్వల /రవళించేసిరి మువ్వల*

*నవ్వులు రువ్విన నీ నయనాలతో*

*యుగాల నుండి నన్ను దగా చేస్తూనే ఉన్నావ్ ..!*

అంటూ యుగయుగాలుగా, తరతరాలుగా పురుషాధిక్య సమాజం స్త్రీని చూసిన కోణాన్ని, స్త్రీలు ఎదురుకుంటున్న సమస్యలు అలాగే వరకట్న దురాచార విధానాన్ని ఎండగడుతూ స్త్రీయే రాసినట్టుగా అందెశ్రీ ఈ కవితను చిత్రించారు.

మరో కవితలో..

*ఓ మనిషీ! నా మేధస్సుకు వేలం వేస్తే*

*అవుతుందేమో నీకు సొంతం*

*కాలానికి గాలం వేస్తే*

*ఎంతటి వారైనా కాక తప్పదు అంతం..!*

అంటూ నా జ్ఞానానికి వేలం వేస్తే నీకు దక్కవచ్చు కానీ, ఎంతటి మేధావులైనా కాలానికి ఎదురు ఈదలేరనే కఠోర సత్యాన్ని తన కవిత్వం ద్వారా వెల్లిబుచ్చాడు.

నాడు తన కవిత్వాన్ని ఆకటికింగొనిపోయి కర్ణాట కిరాట కీచకులకు అమ్ముకోను అని పోతన ప్రకటించినట్టుగా అందెశ్రీ కూడా "సొమ్ములకు నా కవిత అమ్మచూపను గాన /రొమ్మిరిసి చెబుతున్న అమ్మపైన/ సిరులకెప్పుడు నిన్నమ్మ సిగ్గుమాలి" అంటూ సొమ్ముకు ఆశపడి తన కవిత్వాన్ని అమ్ముకోలేదు అందెశ్రీ.

**జయ జయహే తెలంగాణ గేయం**

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

*జయజయహే తెలంగాణ జననీ జయ కేతనం*

*ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం*

*తరతరాల చరిత గల తల్లీ నీరాజనం*

*పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం---*

అంటూ సాగుతుంది ఈ పాట.

తెలంగాణ మలిదశ ఉద్యమ కాలంలో పురుడుపోసుకున్న ఈ పాట స్వరాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించింది. ప్రతీ ఉద్యమ సందర్భంలో ఈ గీతం తెలంగాణ వాడవాడల్లో, వీధి వీధుల్లో మారుమ్రోగింది. రాష్ట్ర అవతరణ తరువాత పది సంవత్సరాలకు తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు 2024 ఫిబ్రవరి 4 వ తేదీన రాష్ట్ర గీతంగా ఆమోదించి, 2024 జూన్ 2 వ తేదీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఈ గీతాన్ని " తెలంగాణ రాష్ట్ర గీతం" గా ప్రకటించారు. తరాలు మారినా తెలంగాణ గడ్డ మీద చెరిగిపోని ముద్రవేశాడు అందెశ్రీ. జయజయహే తెలంగాణ పాట నాది అనడం సరికాదు, అది తెలంగాణ ప్రజలది, తెలంగాణ ఉద్యమ శ్రేణులది, రచన అదృష్టంకొద్ది నావంతు అయ్యింది అని అందెశ్రీ చెప్పుకున్నాడు.

**అందెశ్రీ భక్తి తత్వం:**

"హేతువాదం గొప్పదే; కానీ హేతువాదం కంటే హేతువు ఇంకా గొప్పది" అంటాడు అందెశ్రీ. ఈయనకు చిన్ననాటి నుండే సాధుసత్పురుషుల సాంగత్యం, వరకవి సిద్ధప్ప లాంటి తాత్వికులతో పరిచయం ఏర్పడటం వలన ఈ పరిస్థితులు ఆయనలో భక్తి భావనకు బలమైన బీజం వేశాయి. "ఆధ్యాత్మికం అంటే దేవునిలో విలీనం అవ్వడం కాదు, ఆధ్యాత్మికం అంటే ప్రకృతితో జీవించడం, ఆధ్యాత్మికం అంటే మనిషితనం చెడకుండా జీవించడం, ఆధ్యాత్మికం అంటే పంచభౌతిక తత్వంతో పరాచకం ఆడకపోవడం, ఆధ్యాత్మికం అంటే నేల మీద బ్రతకడం" అని ఈయన అభిప్రాయం. అందెశ్రీ తన కవితలను, ఇతర రచనలను బాసర సరస్వతి అమ్మవారి దగ్గర పెట్టిన తరువాతనే పుస్తకంగా ముద్రించేవారు. గోదావరీ నదీ స్నానం, బాసర జ్ఞాన సరస్వతి దర్శనం, అమ్మవారి ధ్యానం ఆయన ఆచరించేవారు. ఆయన రాసిన జయజయహే తెలంగాణ గీతాన్ని సరస్వతి అమ్మవారికి అంకితం చేశారు. "మెదడు తక్కువ ఉన్నోడు ఆనందం, దుఃఖం అన్నింటినీ తూకం వేసుకుంటూ పోతాడు. కాస్త ఎక్కువ ఉన్నోడు అన్నింటినీ భుజానికి ఏసుకొని నడుస్తూ పోతడు" అనే అందెశ్రీ మాటల్లో శ్రీకృష్ణుడి గీతతత్వం నిగూఢంగా దాగి ఉంది. దేవుడి ఉనికిని ప్రశ్నించేవారిని "సైన్స్ కు అందని

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

దేవుణ్ణి పట్టుకొని మీరందరూ అలా ఊరేగడం దేనికి ?" అని సవాల్ విసురుతాడు అందెశ్రీ. "నిగ్రహం లేనప్పుడు విగ్రహాలు అవసరమే.

నన్ను సృష్టించిన పంచభూతాలు నాకు దైవాలు. అన్నీ తానై నన్ను నడుపుతున్న ఈ ప్రకృతి నాకు దైవం" అనే అందెశ్రీ మాటల్లో ప్రకృతిని మించిన దైవం లేదనే భావన స్పష్టమవుతుంది.

**ప్రాంతీయ అస్తిత్వం:**

తను పుట్టిన నేల రుణం తీర్చుకోవడానికి అందెశ్రీ తన గళం ద్వారా కలం ద్వారా ఎంతో సాహిత్య సృజన చేశాడు. కేవలం తెలంగాణ గురించే కాకుండా తను పుట్టిన ఊరు గురించి, వరంగల్ ప్రాంతం గురించి పాటల ద్వారా తన ప్రేమను వ్యక్తం చేశాడు.

*"........ ఘల్లు చూడు ఓరుగల్లు చూడు, నాటి కాకతీయులు ఏలినట్టి ఖిల్లాచూడు నా జిల్లా చూడు".* అంటూ ఈ పాట పాడుతూ శతాబ్దాల నాటి చరిత్రను మన కళ్లముందు ఉంచాడు అందెశ్రీ.

*"పల్లెనీకు వందనాలమ్మో / నన్ను కన్నా పల్లె తల్లీ నీకు వందనాలమ్మో !! నాకు మాట నేర్పి పాట నేర్పి /బ్రతుకు తోవ చూపినందుకు పల్లె నీకు వందనాలమ్మో !!"* అంటూ తనను కన్న ఊరిని గురించి పాటను కైకట్టి రుణం తీర్చుకున్నాడు అందెశ్రీ.

**పురస్కారాలు:**

ఒక కవికి తన రచన చిరకాలం నిలవడం, ప్రజల నాలుకలపై తన పేరు చెరిగిపోకుండా ఉండటం కంటే మించిన పురస్కారాలు ఉండవు. అందెశ్రీ సమాజంలో చిరస్మరణీయ స్థానాన్ని పొంది దానితో పాటు ఇతర భౌతికమైన పురస్కారాలు, సన్మానాలను ఎన్నో అందుకున్నాడు.

- అందెశ్రీకి కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది.
- అకడెమిక్ ఆఫ్ యునివర్సల్ గ్లోబల్ పీస్ సంస్థ {Washington DC} అందెశ్రీకి గౌరవ డాక్టరేట్ తో పాటూ "లోకకవి" అనే బిరుదును 2014 ఫిబ్రవరి 01న ప్రదానం చేసింది.
- వంశీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే దాశరథి సాహితీ పురస్కారం{2015}.
- డా. రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్ట్ నుండి "డాక్టర్ రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం" అందుకున్నాడు.
- సుద్దాల హన్మంతు – జానకమ్మ జాతీయ పురస్కారం [2022].
- దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం [2024].

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

- విశాఖపట్టణంలోని లోకానాయక్ ఫౌండేషన్ తరుపున "లోకానాయక్ పురస్కారం"
- 2025 జూన్ 2 న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా కోటి రూపాయల నగదు పురస్కారం.

**ముగింపు:**

మట్టిపొరను చీల్చుకొని పుట్టుకొచ్చిన పాటకు పట్టాభిషేకం చేసిన అందెశ్రీ గురించి విన్నా, చదివినా – కరకు బోయ కవిగా మారిన సంఘటనే గుర్తుకొస్తుంది. ఆత్మగౌరవంతో కూడిన ధిక్కారం ఎంత ఉన్నా పర్వాలేదు, అజ్ఞానంతో కూడుకున్న అహంకారం అణువంత ఉన్న ఎవ్వడైనా, ఎంతవాడైన పతనమైతాడు అంటూ సామ్రాజ్యాధినేతలు సైతం కాళ్ళు కడిగి గండపెండేరాలు తొడిగిన కవి పరంపర నేడు భజన చేస్తుంది అని బాధపడ్డాడు. సమాజంలో జరుగుతున్న దురాచారాలపై గళమెత్తాలంటే బడికే వెళ్లనక్కర్లేదు, స్పందించేత సహృదయత ఉంటేచాలు అని నిరూపించిన వ్యక్తి అందెశ్రీ. ఈయన ప్రపంచంలోని అన్ని వింతలను చూసివచ్చాడు. అందెశ్రీ రష్యాలోని ఓల్గా నది నుండి దక్షిణ అమెరికాలోని అమెజాన్ వరకు అన్ని జీవనదులను సందర్శించి దీర్ఘకవిత రాయాలని అనుకున్నాడు కానీ ఆ కల నెరవేరకుండానే పరమపదించాడు. అందెశ్రీ తన కవిత్వాన్ని ఎప్పుడూ సామాన్యుడి గుండె చప్పుడు అని చెప్పుకునేవారు. మనిషి ఎంత శాస్త్ర పరిజ్ఞానం సాధించినా నయాగరా జలపాతాన్ని సృష్టించగడా అంటూ మనిషికి సాధ్యం కానంత గొప్పది ప్రకృతి అని ప్రకృతినే దైవంగా భావించేవాడు. పశువుల కాపరిగా, రోజు కూలిగా తన జీవితాన్ని ప్రారంభించిన అందెశ్రీ తన జీవిత ప్రస్థానంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా జడవకుండా తన జీవితాన్నే కవిత్వీకరించిన మహనీయుడు. మరణం ఆయన దేహానికే కానీ.. ఆయన చేసిన సృష్టికి కాదు. లోకకవి అందెశ్రీ.

**ఉపయుక్త గ్రంథసూచి**

అందెశ్రీ. పాటల పూదోట.

అందెశ్రీ. నిప్పులవాగు. వాక్కులమ్మ ప్రచురణలు, 2022, హైదరాబాద్.

కమలాకరశర్మ, సాగి. మూసీ మాసపత్రిక. సంపాదకుడు, డిసెంబర్ 2025, శ్రీ సాయి ప్రాసెస్, హైదరాబాద్.

పునాస. జనవరి–మార్చి 2026, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్.